ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జయశంకర్ భూపాలపల్లి 5 ములుగు

ఆదివారం 4 ఆగస్టు 2024

సింగరేణిలో బదిలీలు

కాకతీయఖని, ఆగస్టు 3 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో అధికారుల బదిలీలు జరిగాయి. ఏరియా పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అజ్మీరా తుకారాం(డీవైజీఎం) ఎస్టీపీపీ జైపూర్‌కు బదిలీ అయ్యారు. పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో డీవైపీఎంగా విధులు నిర్వహిస్తున్న శ్యామ్‌ప్రసాద్ ఆర్జీ-2కు, కేటీకే-6వ గనిలో సీనియర్ పీవోగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను పర్సనల్ డిపార్ట్‌మెంటుకు బదిలీ చేశారు. అలాగే కేటీకే-1వ గనిలో సీనియర్ పీవోగా పనిచేస్తున్న సాదన్‌ను శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీ చేశారు. ఈ మేరకు కార్పొరేట్ అధికారులు శనివారం సర్క్యులర్‌ను జారీ చేశారు.

నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం



స్నేహమంటే ఇదేరా..

- చెరిగిపోని మధుర జ్ఞాపకం
- ఎన్నటికీ వీడని బంధం

ప్రపంచంలో ధనం, సంపద లేనివాళ్లు ఉండొచ్చు కానీ స్నేహితులు లేనివారు ఉండరు. బాల్యం మొదలు వృద్ధాప్యం వరకు ఆయా దశల్లో అనేక మంది స్నేహితులవుతుంటారు. మన చుట్టు పక్కల ప్రాంతాలు, స్కూలు, కాలేజీ, పని చేసే ప్రదేశాలు.. ఇలా ప్రతీ చోట ఎందరో పరిచయమవుతుంటారు. కానీ వారిలో కొందరు మాత్రమే మిత్రులవుతారు. వీరిలో ఇంకొందరు చిరకాల స్నేహితులుగా మిగులుతారు. ఆప్త మిత్రులుగా వెంట నిలుస్తారు. మన గమ్యానికి దిక్సూచిగా నిలుస్తూ కష్టాల కడలిలో వెన్నంటి ఉంటారు. అందుకే స్నేహితుడు అంటే ఒక భరోసా.. ఒక నమ్మకం.. ఒక ఆలంబన.. ఒక స్ఫూర్తి ప్రదాత కూడా. అంతే కాదు కన్నవారితో, కట్టుకున్నవారితో, తోడబుట్టినవారితో సైతం చెప్పలేని విషయాలను కూడా స్నేహితులతో చెప్పుకోగలుతామంటే స్నేహం గొప్పతనం అది. ఎంతో అందమైన.. అపురూపమైన.. విలువైన స్నేహాన్ని పొందడం ఓ అదృష్టంగా చెబుతుంటారు. స్నేహానికి హద్దులు లేవు. పరిమితులు అంతకన్నా లేవు. వయోబేధం లేదు. ఆస్తి, అంతస్థు, హోదా, అధికారం ఇవేవీ అడ్డు కావు. మంచి స్నేహితుడు తోడుగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నది జగమెరిగిన సత్యం.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 7లో..

ఆంధ్రజ్యోతి సందర్భం



ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తిచేయాలి

వీసీలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 3: రాష్ట్రంలో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి న్యాయమైన దరఖాస్తుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ మొదలుపెట్టాలని నిర్ణయించామని అన్నారు. దరఖాస్తుల స్క్రూటినీ సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సపోర్టు సిస్టం అధికారులకు పూర్తిస్థాయిలో అందిస్తామని అన్నారు. 2020 నాటికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి నష్టం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలుగవద్దని, అదేవిధంగా నీటి వనరులు, కాలువలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ మొదటి దశలో సర్వే నంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన బృందానికి దరఖాస్తులు చేరుతాయని భట్టివిక్రమార్క అన్నారు. ఈ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి జీపీఎస్ ద్వారా సదరు భూమి కోఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేస్తారని చెప్పారు. అదే సమయంలో ఈ భూములు నీటివనరుల బఫర్ జోన్ నాలా, చెరువులు హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోనివి కావని ధ్రువీకరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రాబోయే మూడు నెలల వ్యవధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, ఈ బృందాలు ఫీల్డ్ వెరిఫికేషన్ సకాలంలో చేసే విధంగా కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. ఎల్ఆర్ఎస్ రెండో దశలో సదరు దరఖాస్తులు స్థానిక సంస్థల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, రోడ్డు వెడల్పు ఓపెన్ స్పేస్ తదితర నిబంధనలను లేఔట్‌లో పాటించారా.. లేదా అనే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి జిల్లా, మండల, మునిసిపల్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తుదారులకు వివరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భారీ స్థాయిలో గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్టు, పరారీలో ముగ్గురు

వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 3: వరంగల్ కమిషనరేట్ పరిధిలో భారీ స్థాయిలో గంజాయిని టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు శనివారం పట్టుకున్నారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని రూ.64లక్షల విలువైన 256 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలు వెల్లడించారు. గంజాయి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు నర్సంపేట సమీపంలోని కమలాపూర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. అటుగా కారులో వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను గమనించి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు చెప్పారు. వారిని అడ్డగించిన పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేయగా భూపాలపల్లికి చెందిన బానోత్ బాబు కుమారస్వామి, నస్కురి కుమారస్వామి పట్టుబడగా మహబూబాబాద్‌కు చెందిన జలేందర్, భూపాలపల్లికి చెందిన అంగోతు రాజేందర్, తూర్పుగోదావరికి చెందిన ముకుంద్ పరారైనట్లు కమిషనర్ తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి గంజాయితో పాటు కారు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు డ్రైవర్ వృత్తి చేస్తూ పరారైన ముగ్గురితో కలిసి ఆంధ్రాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారని సీపీ తెలిపారు. ఇదే క్రమంలో 256 కిలోల గంజాయి ఆంధ్రాలో కొనుగోలు చేసి 128 ప్యాకెట్లు చేసి కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు.

ఈ సమావేశంలో డీసీపీ రవిందర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీఐలు రవికుమార్, సార్ల రాజు, రమణమూర్తి, ఎస్ఐలు శరత్‌కుమార్, భాను ప్రకాశ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు. కాగా, గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, నర్సంపేట ఏసీపీలు, సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే.. ప్రభుత్వ లక్ష్యం

- ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో యువతకు ఉపాధి
- భూపాలపల్లి జిల్లాలో రెండు బ్యారేజీలున్నా ఎకరానికి కూడా నీరివ్వలేదు
- నెలాఖరులోపు రుణమాఫీ ప్రక్రియ పూర్తి
- ఇచ్చిన ప్రతీ వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, సీతక్క

గణపురం, ఆగస్టు 3: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి సీతక్క పేర్కొన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని గాంధీనగర్ గుట్టల వద్ద ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ కడియం కావ్య, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలతో కలిసి తొలుత వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఇండిస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేసి బహిరంగ సభలో మాట్లాడారు. జిల్లాలో ఇండస్ట్రీయల్ పార్కుతో అభివృద్ధి మరింత జరిగి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సుమారు 60 ఎకరాల్లో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజల దీవెనలతోనే ఇందిరమ్మ రాజ్యం వచ్చింది మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రజల దీవెనలతోనే ఇందిర మ్మ రాజ్యం వచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాలో పేదోడి ఆలోచనలకు అనుగుణంగా ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు కానుందన్నారు. రైతులను రాజుగా చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను తూచా తప్పకుండా రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు ఇన్సూరెన్స్, విత్తనాల సబ్సిడీలు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఏ వేదిక ఎక్కినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం గురించి చెప్పారని, సొంత నియోజకవర్గంలో నిర్మించిన ఇళ్లను పేపర్లలో ఫొటోలు వేయించుకుని ప్రజలను మభ్య పెట్టి ఓట్లు అడిగారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ 1.50 లక్షల ఇళ్లు మాత్రమే నిరిస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లు నిర్మించబోతుందని పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో తెలంగాణ పేరు కూడా ఎత్తకుండా తొండాట ఆడుతుందన్నారు. ఈ నెలాఖరు లోపు రాష్ట్ర వ్యాప్తంగా రైతుల రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ప్రతీ వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ప్రజలకు ఇచ్చిన ప్రతీ వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. భూపాలపల్లి జిల్లాలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు ఉన్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా నీరివ్వలేదన్నారు. అశాస్త్రీయంగా బ్యారేజీలు నిర్మించగా అవి కుంగిపోతే కాంగ్రెస్ కుట్ర చేసిందని అనడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ కుట్ర చేసే ఉంటే అక్కడ పునాదే పడేది కాదని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో 63కోట్ల ప్రయాణాలు జరిగాయని తెలిపారు. మంత్రి సీతక్క, సీఎం రేవంత్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేస్తాం అంటే ప్రతిపక్షాలు నవ్వారని, ఈ రోజు కోటి మంది స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులుగా చేర్చి

మిగతా 8వ పేజీలో...

ప్రజలకు పథకాలు అందించే బాధ్యత అధికారులదే

జిల్లా అభివృద్ధిపై సమీక్షలో మంత్రులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 3: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించే బాధ్యత అధికారులదేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క అన్నారు. శనివారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో జిల్లా సమగ్రాభివృద్ధిపై అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గడిచిన ఏడు నెలల్లో ఎన్నో విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని, గత పదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో దివాలా తీసిందన్నారు. రూ.7లక్షల కోట్ల అప్పు ఉన్నా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్నారు. పేదలకు మంచి చేసేందుకు ఉద్యోగుల సహకారం కావాలని, అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందన్నారు. రాష్ట్ర మంత్రి వర్గం రోజుకు 16 గంటలు పని చేస్తోందని, ప్రజలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రూ.31వేల కోట్ల వ్యవసాయ రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, రైతుల పట్ల రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను ఇబ్బంది పెట్టకుండా ఉండాలని అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే సత్యనారాయణరావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ప్రారంభించిన మంత్రులు

భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సముదాయంలో రూ.3.6 కోట్లతో నిర్మించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్, రూ.27లక్షలతో నిర్మించిన డాక్టర్స్ క్యాంటీన్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క శనివారం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో మంత్రులు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే సత్యనారాయణరావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, శ్రీనివాస్‌రెడ్డి

రోడ్డు ప్రమాదాలను తగ్గించేలా చూడాలి

దళారుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

అర్థ వార్షిక నేర సమీక్షలో ఎస్పీ శబరీశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఆగస్టు 3: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవడంతోపాటు రైతులను మోసం చేసే దళారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ శబరీశ్ అధికారులకు సూచించారు. శనివారం ములుగులోని జిల్లా పోలీసు కార్యాలయంలో అర్థ వార్షిక నేర సమీక్ష సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. దొంగతనాల కేసులను సరైన పద్ధతిలో నమోదు చేసి సాధ్యమైనంత త్వరగా ఛేదించి బాధితులకు అందజేయాలని, ఇందుకోసం ప్రధాన కూడళ్లలో ప్రజలు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, రేడియం స్టిక్కర్లు, తదితరాలను ఏర్పాటు చేయాలన్నారు. ములుగు పట్టణంలో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న యూటర్న్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కనెక్టింగ్ రోడ్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, ములుగు అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రాములు, సీఐలు శంకర్, శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజొద్దీన్, వెంకటేష్, కృష్ణప్రసాద్, హరీష్, సూరి, తిరుపతిరావు, షేక్‌మస్తాన్ పాల్గొన్నారు.

బొగతలో పర్యాటకుల సందడి

వాజేడు, ఆగస్టు 3: తెలంగాణ నయాగార బొగత జలపాతంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. పాలనురగ వలె ప్రవహిస్తున్న జలపాతం జలధారలను చూసిన పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు జలపాతం అందాలకు ఫిదా అయ్యారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, ములుగు తదితర పట్టణాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

స్వచ్ఛదనం, పచ్చదనంను సక్సెస్ చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 3: ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంను విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం భూపాలపల్లిలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్వర్ అధ్యక్షతన సమావేశం జరుగగా వార్డు స్పెషల్ ఆఫీసర్లు, మెప్మా, రిసోర్స్ పర్సన్స్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రతి రోజు శానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు జరగాలని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వంటి వాటిని వాడకుండా అవగాహన కల్పించాలన్నారు.

శాతవాహన, గోల్కొండ రైళ్ల బంద్

పద్మావతి, చార్మినార్, సింహపురి రైళ్ల దారి మళ్లింపు

గిర్మాజీపేట, ఆగస్టు 3: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ న్యూ పశ్చిమ క్యాబిన్ మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు కొన్ని రైళ్లను రద్దు చేసింది. అలాగే శుక్రవారం నుంచి మరికొన్ని రైళ్లను వరంగల్ రాకుండా దారి మళ్లించింది. ప్రతీరోజు సికిందరాబాద్- వరంగల్- గుంటూరు మధ్య రాకపోకలు సాగిస్తున్న గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- వరంగల్- విజయవాడ మధ్య రాకపోకలు సాగిస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్, డోర్నకల్- విజయవాడ రైల్వేసేషన్ మధ్య రాకపోకలు సాగిస్తున్న డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులు తమ ప్రయాణాలను కొనసాగించి రైల్వేకు సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే కోరింది.

పలు రైళ్ల దారిమళ్లింపు

సికింద్రాబాద్ నుంచి వరంగల్ మీదుగా తిరుపతి, గుడూరు, చెన్నై సెంట్రల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్, పద్మావతి, సింహపూరి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్‌కు రాకుండా దారి మళ్లించారు. ప్రస్తుతం పంగిడిపెల్లి -కాజీపేట, వరంగల్-విజయవాడ-తెనాలి మీదుగా నడుస్తున్న ఈ రైళ్లను పంగిడిపల్లి- గుంటూరు- తెనాలి మీదుగా దారి మళ్లించారు. దీంతో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పద్మావతి, సింహపురి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 10వ తేదీ వరకు వరంగల్‌కు రావని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

శ్రావణ మాసంలో అదనపు బస్సులు

రీజినల్ మేనేజర్ డి.విజయభాను

బాలసముద్రం, ఆగస్టు3: వచ్చే శ్రావణ మాసంలో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులను నడపనున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగసు 5వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతున్నందున ఈ మాసంలో ఎక్కువ సంఖ్యలో శుభకార్యములు, వివాహముహూర్తములు ఉండడంతో ప్రయాణికులకోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అద్దె బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల ద్వారా రాజధాని, సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, ఏసీ, నాన్‌ఏసీ బస్సులు కోసం ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని అన్నారు. హనుమకొండ-9949857692, 9959226049, వరంగల్-1- 7382855793, 9959226047, వరంగల్-2-7382856145, 9959226048, జనగామ 7382852818, 9959226050, పరకాల 9705479088, 9959226051,భూపాలపల్లి 8978704061, 9959226707, నర్సంపేట 7382854074, 9959226052, మహబూబాబాద్ 9948214622, 9959226054, తొర్రూరు 7382855078, 9959226053 నెంబర్లలో అద్దె బస్సులు కోసం సంప్రదించాలని రీజినల్ మేనేజర్ తెలిపారు.

తరాలు మారినా చెరగని జ్ఞాపకం
నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు..



హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/లింగాలఘణపురం, ఆగస్టు 3: నిక్కరు నుంచి జీన్స్ ప్యాంట్‌కి ఎదిగినా.. కాన్వెంట్ నుంచి కాలేజీకి మారినా.. పెన్సిల్ నుంచి పెన్‌డ్రైవ్ దాకా వచ్చినా.. నోట్‌బుక్ నుంచి ఫేస్‌బుక్‌కు ఎదిగినా.. ట్రెండ్ మారినా ఫ్రెండ్ మాత్రం మారనే మారడు.. ల్యాండ్ లైన్ నుంచి స్మార్ట్‌ఫోన్‌కు వచ్చినా మాటల్లో చిలిపితనం మారదు.. మొట్టికాయ నుంచి గట్టిపంచ్‌లోకి మారినా నొప్పిలేని తియ్యందనమే ఒక అందమైన ఫ్రెండ్‌షిప్.. టెక్నాలజీ పెరిగినా.. ట్రెండ్ మారినా ఫ్రెండ్‌లోని స్పెల్లింగ్ మారదు.. స్నేహంలోని ఫీలింగ్ అంత కంటే మారదు. ఏ సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల నుంచి నేటి వరకు అదే 'సోపతి' కొనసాగు తోంది. కుల, మత బేధం అంతకన్నా ఎరుగనిది.. బంధుత్వం కన్నా గొప్పది స్నేహమొక్కటే. అనునిత్యం మనల్ని ప్రోత్సహిస్తూ ఆనంద డోలికల్లో ముంచేస్తూ దుఃఖాల ఎడబాటుతో సన్మార్గంలో నడిపించేవాడే నిజమైన స్నేహితుడు. ఫ్రెండ్ షిప్‌డే నాడు ఒకరినొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, శుభాకాంక్షలు తెలుపుకోవడం కొన్నేళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. మార్కెట్‌లో పలు రకాల గ్రీటింగ్ కార్డులు, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు లభ్యమవుతున్నాయి. ఒకప్పుడు న్యూ ఇయర్, ఫ్రెండ్‌షిప్ వాలైన్‌టైన్‌డేకు గ్రీటింగ్స్‌కు స్వయంగా ఇచ్చిపుచ్చుకునేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది.. ఆధునిక సొబగులు అరచేతిలో ప్రత్యక్షమవుతున్నాయి. సోషల్‌మీడియా దూరతీరాల్లో ఉన్న స్నేహాలను ఒక్కటి చేస్తోంది.

సోషల్ మీడియాతో చేరువవుతున్న స్నేహం

ఒకప్పుడు పాఠశాలను.. కళాశాలను విడిచిన స్నేహం మళ్లీ ఎప్పుడు ఎక్కడ కలుస్తుందో చెప్పలేకుండా ఉండేది.. పండుగలకో పబ్బాలకో సొంతూరికి వస్తే తప్ప చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం కష్టసాధ్యంగా ఉండేది. వర్తమాన సాంకేతిక యుగం ఆధునిక ప్రపంచాన్ని అడుగడుగునా శాసిస్తోంది. అంతేకాదు.. ఎల్లలు దాటిన స్నేహాన్ని దగ్గర చేస్తుంది. సోషల్‌మీడియా పేరిట అల్లంత దూరాన ఉన్న బాల్యస్నేహితుడి ఆత్మీయ పరిమళాలు స్మార్ట్ ఫోన్‌ద్వారా దగ్గర అవుతున్నాయి.

ఆపదలో భరోసా.. ఆత్మీయతకు చిరునామా..

ఆపదలో ఉన్నవాడికి భరోసా.. ఆత్మీయతకు చిరునామా కలిగినవాడే అసలైన స్నేహితుడు.. అవసరం కోసం దగ్గరకు వచ్చి అవసరం తీరాక అడ్రస్ లేకుండా పోయేవాడు స్నేహితుడు కానే కాడు.. మిత్రుడికే కాదు.. మిత్రుడి కుటుంబ సభ్యులకైనా సరే ఆపద వస్తే తానున్నానంటూ ఆపద్బంధువులా వచ్చి ఆదుకునే స్నేహితులు ప్రతీ వ్యక్తికి కనీసం నలుగురైనా ఉంటారు. అలాంటి స్నేహితులు లేకపోవడం నిజంగా ఒక దుదృష్టకరమే.. ఆపదలో ఆదుకునే స్నేహితులే లేరనుకుంటే అది స్నేహానిది కాదు పొరపాటు.. స్నేహం చేస్తున్న వ్యక్తులది అనుకోవాలే తప్ప స్నేహాన్ని నిందించాల్సిన పనిలేదు. తాళికట్టిన భార్యకు సైతం చెప్పుకోలేని రహస్యాలను ఆత్మీయ స్నేహితులతో పంచుకొని బాధలను చెరిపేసుకుంటారు. అదీ స్నేహబంధానికి ఉన్న గొప్పతనం.

భిన్నతేదీల్లో స్నేహితుల దినోత్సవం

స్నేహితుల దినోత్సవానికి భిన్న తేదీలు ఉన్నాయి. హాల్‌మార్క్ కార్డ్‌ల వ్యవస్థాపకుడు జాయిస్ హాల్ 1919లో స్థాపించిన ఫ్రెండ్‌షిప్ డే వివిధ దేశాల్లో వేరు వేరు తేదీల్లో జరుపుకొంటున్నారు. 2011లో ఐక్యరాజ్య సమితి జూలై 30ని ఫ్రెండ్‌షిప్ డేగా గుర్తించింది. అయితే ప్రజలు, దేశాలు, సంస్కృతులు, వ్యక్తుల మధ్య స్నేహం శాంతి ప్రయత్నాలను ప్రేరేపిస్తుందన్న భావనతో యూఎన్ జనరల్ అసెంబ్లీ 2011లో అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని ప్రకటించింది. అయితే మెక్సికో, ఈక్వెడార్ లాంటి పలు దేశాలు ఫిబ్రవరి 14న స్నేహ దినోత్సవాన్ని జరుపుకుంటుండగా సింగపూర్‌లో ప్రజలు ఏప్రిల్ మూడో వారంలో స్నేహ దినోత్సవాన్ని పాటిస్తారు. ఇక మనదేశం సహా అనేక దేశాల్లో ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు తేదీల్లో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నా స్నేహం గొప్పతనం, స్నేహబంధాలను మాత్రం అందరూ ఒకేలా గౌరవిస్తారు.

మిత్రుడి కూతురు చదువుకు స్నేహితుల తోడ్పాటు



స్నేహితుడి కుమార్తెకు స్కూల్‌ఫీజు ఇస్తున్న మిత్రులు (ఫైల్)

కేసముద్రం: కేసముద్రం మండలం వెంకటగిరికి చెందిన గాండ్లఅశోక్ 2018లో అనారోగ్యంతో మృతి చెందాడు. అంతకు ముందే అశోక్ భార్య మృతి చెందడంతో వారి కూతురు శివాని తల్లిదండ్రులు లేక నర్సంపేటలోని అమ్మమ్మ ఇంటి వద్ద ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. 1996-97లో అశోక్‌తో కలిసి పదోతరగతి చదివిన స్నేహితులు ఆయన కూతురు శివాని చదువు బాధ్యతను తీసుకున్నారు. అశోక్ మృతి చెందిన నాటి నుంచి ఐదేళ్లుగా ఏటా ఆమె విద్యకు అయ్యే పూర్తి ఖర్చును వారే భరిస్తున్నారు. ఈ ఏడాది కూడా రూ.45వేలను చెల్లించారు. ఐదేళ్లుగా స్నేహితుని కుమార్తె చదువుకోసం సహకరిస్తున్న ఈ మిత్రులను పలువురు అభినందిస్తున్నారు. అంతేకాకుండా 2018లో అశోక్ ఇద్దరు కూతుళ్లకు రూ.లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

స్నేహితుడు అనారోగ్యం పాలైతే రూ.50వేలు



అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి రూ. 50వేలు అందజేస్తున్న బాల్యమిత్రులు

లింగాలఘణపురం మండలం నవాబుపేట జడ్పీహైస్కూల్ 2002-03 బ్యాచ్‌కు చెందిన పటేల్‌గూడెం యువకుడు వెంకటేశ్ అనారోగ్యం పాలుకావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా బాల్య స్నేహితులు అంతా కలిసి రూ.50వేల ఆర్థిక సాయం అందించి తామున్నామంటూ భరోసాగా నిలిచారు. స్నేహబంధాలకు ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇంకా అనేకంగా స్నేహితులకు అండగా నిలుస్తూ స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ నిరూపిస్తున్నారు.

బాల్యస్నేహితులను మరిచిపోవద్దు


వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను



బాలసముద్రం: బాల్యస్నేహితులను ఎవరూ మరిచిపోవద్దు. మేము ఇప్పటికీ ఫోన్ చేసి చిన్ననాటి విషయాలను మాట్లాడుకుంటాం. స్నేహితులతో మాట్లాడితే మనసు ఎంతో తేలికగా ఉంటుంది. కుటుంబ సభ్యులు, బంధువులతో కంటే స్నేహితులతోనే అన్ని విషయాలు మాట్లాడుకుంటాం. ఉద్యోగాలలో స్థిరపడిన స్కూల్, కాలేజీ ఫ్రెండ్స్‌తో వారానికోసారి కలిసి సరదాగా మాట్లాడుకుంటాం. నేను రీజినల్ మేనేజర్‌గా, నాఫ్రెండ్ కండక్టర్‌గా ఒకే దగ్గర పని చేస్తున్నాం. మామధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు ఉండవు. బాల్య స్నేహితులతో కలిసి ఈమధ్యనే పూర్వవిద్యార్థుల సమావేశంలో కలిసి పాత రోజులు గుర్తు చేసుకున్నాం.

కల్మషం లేనిది స్నేహబంధం

ఎం.జితేందర్‌రెడ్డి, ఎస్‌బీ ఏసీపీ



వరంగల్ క్రైం : కల్మషం, లాభాపేక్ష లేనిది కేవలం స్నేహబంధం మాత్రమే. మంచి స్నేహితులున్నవారు ఉన్నతస్థితికి ఎదుగుతారు. మన కష్టసుఖాల్లో స్నేహితులు పాలుపంచుకుంటారు. కుటుంబసభ్యులకు చెప్పుకోలేని విషయాలను స్నేహితులతో పంచుకుంటాం. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా ఈర్ష్య పడకుండా ప్రోత్సహించేవారు స్నేహితులు. నా కష్ట సుఖాలను స్నేహితులతో, వారి కష్టసుఖాలు నాతో పంచుకుంటాం. సమయం దొరికినప్పుడల్లా మాట్లాడుతుంటాం. వీలున్నప్పుడు కలుసుకుంటాం.

మా స్నేహితులకు సేవాభావం ఎక్కువ

డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, ప్రముఖ యూరాలజిస్టు



వరంగల్ మెడికల్: మా చిన్ననాటి స్నేహితులందరికీ సేవా భావం ఎక్కువ. ప్రజలకు ఏదో చేయాలనే తపన ఉండేది. పేదల కోసం ఆస్పత్రి పెట్టి సహాయం చేయాలనే కోరిక ఉంది. అందుకోసమే గ్లోబల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. ఈ ఫౌండేషన్ ద్వారా పేదలకు న్యాయం చేయాలని అనుకుంటున్నాం.



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ, డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు

హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏకం చేయాలి

వరంగల్ మహా నగర అభివృద్ధికి మరో పోరాటం

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

వడ్డెపల్లి, ఆగస్టు 3: హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏకం చేయాలని, వరంగల్ మహానగర అభివృద్ధికి మరో పోరాటం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో వరంగల్ మహానగర పునర్నిర్మాణం, పరిపాలన సౌలభ్యం అభివృద్ధిపై ముప్పిడి సంపత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయనతో పాటు మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, తెలంగాణ ఉద్యమకారులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, గుడిమళ్ల రవికుమార్, ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చారిత్రక వరంగల్ జిల్లాను ఇష్టారాజ్యంగా ఆరు ముక్కలు చేసి ఆరు జిల్లాలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. ఫలితంగా వరంగల్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని విమర్శించారు. గత సీఎం కేసీఆర్ చారిత్రక నగరాన్ని ఆరు ముక్కలుగా విచ్ఛిన్నం చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని రాజకీయ చైతన్యాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. గత పాలకులు చేసిన ద్రోహాన్ని ప్రస్తుత పాలకులు సమీక్షించి వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏకం చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

ఉత్తర తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కేంద్రమైన వరంగల్, ఉత్తర తెలంగాణకు విద్యాకేంద్రమైన హనుమకొండ, దక్షిణ భారత దేశానికి రైల్వే కేంద్రమైన త్రినగరి వరంగల్ మహా నగరాన్ని ఏకం చేయడం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. నగరమంటే పారిశ్రామిక ప్రాతినిధ్యం కలిగి ఉండాలని, పాలన సౌలభ్యం అంటే ప్రజలకు జీవన అవసరాలను మెరుగుపర్చేదిగా ఉండాలని పేర్కొన్నారు. అందుకు భిన్నంగా రాజకీయ, వ్యాపార వర్గాల మేలు కోసం జిల్లాలను ఏర్పాటు చేసి మహా నగరాన్ని విభజించారని దుయ్యబట్టారు. దక్షిణ భారత దేశాన్ని ఏలిన వరంగల్ కేంద్రాన్ని చారిత్రిక ఆనవాళ్లు లేకుండా చేయడమే కాకుండా అభివృద్ధిలో హనుమకొండ 30వ స్థానంలో ఉందని తెలిపారు. పాత జిల్లాల కేంద్రాలు అభివృద్ధి కేంద్రాలుగా ఉండేవని, కొత్త జిల్లాలతో ఆ అభివృద్ధి కుంటుపడిందని స్పష్టం చేశారు. మహానగరాలకు రావల్సిన జాతీయ స్థాయి నిధులు, సంస్థలు రాకపోవడం వల్ల వరంగల్ మహా నగర అభివృద్ధి వెనుకబడి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఒక హైదరాబాద్ మహా నగరానికి మాత్రమే తరలిపోయి బతుకుతున్నారని అన్నారు. ఉత్తర తెలంగాణ కేంద్రమైన వరంగల్ మహా నగరాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోని సగభాగం ప్రజలకు ఉపాధి కేంద్రంగా మారుతుందని వారు స్పష్టం చేశారు. పోరాటాలకు కేంద్రమైన వరంగల్ మహానగరాన్ని కాపాడుకోవడానికి మరోపోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. రెండు జిల్లాల్లోని వివిధ రంగాలకు చెందిన వారిని ఏకం చేసి ప్రస్తుత ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వడమే కాకుండా రెండు జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరిస్తామని తెలిపారు.

ఈ చర్చా గోష్ఠిలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, టీజేఎస్ నేత చిల్లా రాజేంద్రప్రసాద్, ప్రజా సంఘాల నేతలు కర్రా యాదవరెడ్డి, కోండ్ర నర్సింగరావు, సోమ రాంమూర్తి, కూనూరు రంజిత్‌గౌడ్,ఎండీ రాజ్‌మహ్మద్, ఐతం నగేష్, డాక్టర్ అశోక్‌రెడ్డి, రాచకొండ ప్రవీణ్‌కుమార్, నలిగంటిచంద్రమౌళి, దారం జనార్థన్, డాక్టర్ గిరిజా రాణి, పల్లపు సమ్మయ్య, సారంపెల్లి వాసుదేవరెడ్డి, సోమిడి శ్రీనివాస్, బొట్ల చక్రపాణి, తాడిశెట్టి క్రాంతికుమార్, నున్న అప్పారావు, కేడెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

వరంగల్ క్రైం, ఆగస్టు 3: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పూజారి సందీప్ అనే యువకుడిపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈనెల 1వ తేదీన పెగడపల్లి డబ్బాల సమీపంలోని సుందరయ్యనగర్‌కు చెందిన పూజారి సందీప్ అతడి పక్క గృహంలో నివాసం ఉండే బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో యువకుడు ఈ సంఘటనకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సందీప్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రవిందర్ తెలిపారు.

ఉపాధ్యాయుల సర్వీసును పరిరక్షించాలి

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 3: మ్యూచువల్ బదిలీలు పొందిన ఉపాధ్యాయుల సర్వీసును ప్రభుత్వం పరిరక్షించాలని జీవో 317 ద్వారా బదిలీలు పొందిన ఉపాధ్యాయ బాధితులు సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి, డైరెక్టర్‌లకు లేఖ ద్వారా వినతి పంపించారు. శనివారం భూపాలపల్లి పట్టణంలో సంబంధిత లేఖను వారు విడుదల చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018ని అనుసరించి జీవో 318 ప్రకారం స్థానికతను చూడకుండా కేవలం క్యాడర్ సీనియారిటీ ఆధారంగా ఉద్యోగ ఉపాధ్యాయులను కొత్త జిల్లాలకు కేటాయించడం మూలంగా వేలాది మంది స్థానికతను కోల్పోయారని అన్నారు. కాగా, పునఃపరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగాల భర్తీలో సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 3: ములుగులోని మెడికల్ కళాశాల ఉద్యోగాల భర్తీలో శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరిగిన నియామకాలు పారదర్శకంగా లేవని, ఇందులో పైరవీలు కొనసాగాయని ఆరోపించారు. ఈ విషయంపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కలెక్టర్‌తో సంప్రదించి సీనియారిటీకి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ రాసిన చట్టాలే దేశాన్ని నడిపిస్తున్నాయి

▸▸ జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 3: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన చట్టాలు, శాసనాలే నేడు దేశాన్ని నడిపిస్తున్నాయని జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.జయరాంరెడ్డి అన్నారు. శనివారం జంగేడులోని ప్రభుత్వ పాఠశాలలలో న్యాయ విజ్ఞాపన సదస్సును నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నటువంటి కాలం చాలా విలువైందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. చట్టం ముందు అందరూ సమానమేనని, అసమానతలు లేని జీవితాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి చెన్నయ్య, పాఠశాల హెచ్‌ఎం చిలువేరు అశోక్, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిలర్ కంప అక్షయ, సఖి అడ్మినిస్ట్రేటర్ గాయత్రి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటస్వామి, మిషన్ కోర్డినేటర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

▸▸ తృటిలో తప్పిన ప్రాణాపాయం

ములుగు రూరల్ ఆగస్టు 3: ములుగు మండలం సర్వాపూర్ గ్రామపంచాయతీ శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన శనివారం జరిగింది. అప్రమత్తంతో డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... సర్వాపూర్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ చెత్త సేకరణలో భాగంగా జగ్గన్నగూడెం వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ చేసి వస్తున్న క్రమంలో బొగ్గుల వాగులో పడిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణాలను కాపాడుకున్నాడు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే బొగ్గుల వాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించి ప్రమాదాలు జరుగకుండా నివారించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయాలి

▸▸ సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్

ములుగు, ఆగస్టు 3: ప్రతి ఒక్కరూ అవయవ దానం చేసి మరొకరికి జీవితాన్ని ప్రసాదించాలని సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ అన్నారు. జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ములుగులోని సఖి కేంద్రంలో శనివారం జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో అవయవాలు దొరకక చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, రక్తదానం తర్వాత అవయవ దానం కూడా ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయడం ద్వారా మన మరణానంతరం మనం చేసే అవయవ దానం ద్వారా ప్రపంచాన్ని మళ్లీ చూసే అవకాశం ఉంటుందని తెలిపారు. నేను కూడా అవయవ దానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. బాలల పరిరక్షణ విభాగం, సఖి, భరోసా, చైల్డ్ హెల్ప్‌లైన్, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి స్వచ్ఛమైన స్నేహం అవసరం

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 3 : సమసమాజ నిర్మాణానికి స్వచ్ఛమైన స్నేహం అవసరమని మండల ప్రత్యేకాధికారి స్వర్ణలత లెనిన అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్నేహితుల దినోత్సవం జరగగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో అత్యంత ముఖ్యమైన పాత్ర స్నేహానిదేనని అన్నారు. ఉన్నతమైన స్నేహితులను ఎన్నుకోవడంలో యువత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాసరాజు, జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం జీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు పొన్నాడ రామకృష్ణ, రాంబాబు, రోషిత పాల్గొన్నారు.

ఒడిపిలవంచ ఎర్ర చెరువును పరిశీలించిన అధికారులు

కాటారం, ఆగస్టు 3 : మండలంలోని ఒడిపిలవంచ పరిధిలోని ఎర్ర చెరువును ఇరిగేషన్ ఈఈ యాదగిరి, డీఈఈ ఉపేందర్ శనివారం పరిశీలించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన రిజర్వాయర్ల పైప్‌లైన్ల అలైన్‌మెంట్ మార్పులు, చేర్పుల సాధ్యాసాధ్యాలపై సర్వే నిర్వహించారు. సర్వే అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఈఈ యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణ, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

చిట్యాల, ఆగస్టు 3: వసతి గృహాల్లోని విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల ప్రవీణ్ డిమాండ్ చేశాడు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. వసతిగృహం నుంచి పాఠశాలకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్నందున విద్యార్థులకు ఉచిత బస్ పాసులు అందచేయాలన్నారు. ఆయన వెంట జిల్లా కమిటీ సభ్యుడు రత్న రమాకాంత్ ఉన్నాడు.

ప్రేరణ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చిట్యాల, ఆగస్టు 3: భారత ప్రభుత్వం పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం ఆధ్వర్యంలో ప్రేరణ, అనుభవపూర్వక అభ్యాసన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిస్తుంది. మండలంలోని జూకల్లు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని కొడారి స్రవంతి, తొట్ల భానుప్రసాద్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణ, ఊర్మిళ శనివారం తెలిపారు. అయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సాదు మమత, లావణ్య శిక్షణలో విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 6 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్యాలయం ఉన్నా విధులకు డుమ్మా..

▸▸ 10 నెలలుగా ఇంటి వద్దనే కంప్యూటర్ ఆపరేటర్ విధులు



మూసివున్న ఎంఈవో కార్యాలయం

కన్నాయిగూడెం, ఆగస్టు 3: నూతనంగా ఏర్పడిన కన్నాయిగూడెం మండలంలో ప్రభుత్వ శాఖలకు భవనాలు నిర్మించి పరిపాలన అందిస్తున్నారు. అందులో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో భవనాన్ని నిర్మించి తాత్కాలికంగా ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా శనివారం ఎంఈవో కార్యాలయం తెరుచుకోలేదు. మండల ప్రజలు అందించిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా అసలు విషయం బయటపడింది. ఈ కార్యాలయానికి కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించేందుకు అంజలి అనే ఉద్యోగిని గత విద్యా సంవత్సరం అక్టోబరులో కేటాయించారని, ఆమె విధులకు హాజరు కాకుండానే నెల నెల జీతం తీసుకుంటున్నట్లు పలువురు వాపోయారు.

ఇదే విషయమై ఇన్‌చార్జ్ ఎంఈవో రాజేష్‌ను ఫోన్‌లో సంప్రదించగా తాను డీఎస్సీ ఎగ్జామ్ విధుల్లో ఉన్నానని సమాధానం ఇచ్చారు. సీఆర్‌పీలు కాంప్లెక్స్‌కు వెళ్లి ఉంటారని అన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ విధులకు రాలేదని వివరణ కోరగా గత అక్టోబరులో కొత్తగా అపాయింట్ కావడంతో వెంకటాపురంలో అక్టోబరు, నవంబరులో ట్రైనింగ్ తీసుకుంటూ విధులు నిర్వర్తించిందని తెలిపారు. అనంతరం డెలివరీ కావడంతో ఇంటివద్దనే ఉండి ఆఫీసు పనులు చేస్తుందని, డెలివరీ టైంలో 20 రోజుల జీతం కట్ చేశామని సమాధానం ఇచ్చారు. కాగా, సోమవారం నుంచి కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహించమని చెబుతా అని ఫోన్ కట్ చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలి

▸▸ వీసీలో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 3:జిల్లాలో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలను ఈనెల 23వరకు సమర్పించాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలన్నారు. నూతన చట్టం ముసాయిదా కింద సెక్షన్ 4 ప్రకారం కొత్తఆర్‌వోఆర్ రికార్డు రూపకల్పన, అందుబాటులో ఉన్న రికార్డు సవరణకు అవకాశం ఉందని చెప్పారు. గత చట్టం కింద నిలిచిపోయిన సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి సెక్షన్ 6 వెసులుబాటు కల్పించిందని, సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ముసాయిదా బిల్లు అందుబాటులో ఉందని అన్నారు.

ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజలు తమ సలహాలు, సందేహాలు, అభిప్రాయాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీసీఎల్ఏ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 23 వరకు తెలియజేయాలని కమిషనర్ నవీన్ మిట్టల్ చెప్పారు. కలెక్టర్ నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అందజేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాల మేరకు కొత్త చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు. అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు నూతన ఆర్‌వోఆర్ చట్టం అమలులోకి వచ్చేలోపు పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని, మరో మూడు వారాల వ్యవధిలో పూర్తి స్థాయిలో ధరణి దరఖాస్తులు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ధరణి ద్వారా వచ్చిన దరఖాస్తులను తిరస్కరించే పక్షంలో తప్పకుండా కారణాలను తెలియజేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు : ఎమ్మెల్యే

కాకతీయఖని, ఆగస్టు 3: పోడు భూములు సాగు చేసుకునే అర్హులైన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సీసీఎఫ్ ప్రభాకర్‌ను కోరారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సీసీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సీసీఎఫ్‌ను కలిసారు. ఈ సందర్భంగా అటవీశాఖలోని అభివృద్ధి పనులను గురించి చర్చించారు. అటవీశాఖ కార్యాలయం ఎదుట గతంలో డబ్బాలు వేసుకుని జీవిస్తున్న వారి డబ్బాలను తొలగించారని, వారికి డబ్బాలను ఏర్పాటు చేసి ఇస్తే జీవనోపాధి ఉంటుందని కోరారు. అటవీశాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారం అయ్యేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంనర్సింహారెడ్డి, మధు, అంబాల శ్రీనివాస్, కొమురయ్య, సాంబమూర్తి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోరంచపల్లి వాసులను ఆదుకోవాలి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 3: భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామస్తులను ఆదుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ రఘునాథ్‌రెడ్డి శనివారం భూపాలపల్లికి విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గత ఏడాది భారీ వర్షాల కారణంగా మోరంచపల్లి చాలా దెబ్బతిందని పేర్కొన్నారు. నలుగురు గ్రామస్తులు మృత్యువాత పడడమే కాకుండా 58 పశువులు కూడా కొట్టుకుపోయాయని తెలిపారు. ఈక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదుకుంటున్నారని తెలిపారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిగా దెబ్బతిందని, ఇళ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. కాగా, లిఫ్ట్‌ను బాగు చేసుకోవడానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా గ్రామానికి 300 ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

మన్యం ముద్దుబిడ్డ రాజయ్య

▸▸ మాజీ ఎమ్మెల్యేకు సీపీఎం శ్రేణుల ఘన నివాళి



రాజయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

వాజేడు, ఆగస్టు 3: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు సున్నం రాజయ్య నాల్గవ వర్ధంతిని ఆ పార్టీ శ్రేణులు శనివారం వాజేడులోని గుడిసెల పోరాట కేంద్రం వద్ద నిర్వహించారు. మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ సమస్యలపై పోరాడిన మహానేత రాజయ్య అని గుర్తు చేశారు. కరోనా మహమ్మారి వల్ల ప్రజా ఉద్యమనేతను సీపీఎం కోల్పోవడం బాధాకరమని అన్నారు. ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తూ ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయడమే ఆయనకు ప్రజలు ఇచ్చే నివాళి అన్నారు. కార్యక్రమంలో నాయకులు జెజ్జరి దామోదర్, బచ్చల కృష్ణబాబు, గుగ్గిళ్ల దేవయ్య, తోలెం ముత్తయ్య, బచ్చల సౌమ్య, అనిల్, అంగాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 3: భూపాలపల్లి పట్టణంలోని 11కేవీ ఫీడర్ పై లైన్ మరమ్మతులు చేయాల్సి ఉండగా ఆదివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు మెయిన్‌రోడ్డు, రాజీవ్‌నగర్, జవహర్‌నగర్, తహసీల్దార్ కార్యాలయం రోడ్, రాజీవ్‌నగర్, కారల్‌మార్క్స్‌కాలనీ, కృష్ణకాలనీ, యాదవ కాలనీ, 6ఇంక్లైన్ బ్యారెక్స్‌లలో విద్యుత్ నిలిచిపోతుందని తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మల్హర్, ఆగస్టు 3: ఈనెల 5వ తేదీతో రైతు బీమా గడువు ముగుస్తున్నందున బీమా చేసుకోని రైతులు త్వరపడాలని ఏవో సుధాకర్ తెలిపారు. ఇందుకు గాను రైతు తేది.28-06-2024 లోపు పట్టాదారు పాస్‌బుక్కు పొంది ఉండాలన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు ఉండి కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి గాను రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు సంబంధిత ఏఈవోకు రైతు వేదికలో అందజేసి రైతు బీమా చేసుకోవాలని సూచించారు.

కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 3: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. శనివారం గోదావరిలో భక్తుల సందడి కానవచ్చింది. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తుల పూనకాలతో కోలాహలంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కాళేశ్వర క్షేత్రానికి తరలివచ్చి స్వామి వారికి పూజలు చేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఏటూరునాగారం, ఆగస్టు 3: ఏటూరునాగారం, వాజేడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆర్‌ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏటూరునాగారం ఆర్‌ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జాబితా ప్రకారంగా ప్రవేశాలను నిర్వహిస్తామని తెలిపారు. ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

గురుకులాన్ని సందర్శించిన మంత్రి సీతక్క

▸▸ బండారుపల్లిలో విద్యార్థుల అస్వస్థతపై ఆరా

▸▸ ప్రహరీ గోడ, తరగతి గదుల నిర్మాణానికి హామీ



గురుకులం పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 3: ములుగు మండలం బండారుపల్లిలోని టీజీ బాలుర గురుకులంలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శనివారం సాయంత్రం గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. గురుకులం పరిసరాలు, డార్మెంటరీ, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమవుతూ సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళలో బయటకు రావొద్దన్నారు. విద్యార్థుల యోగక్షేమాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గురుకులం చుట్టూ ప్రహరి గోడ, అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మాణానికి చొరవ చూపుతానని అన్నారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ముగిసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

ఏటూరునాగారం, ఆగస్టు 3: సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రతీ ఏడాది నిర్వహించుకునే అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మావోయిస్టుల కదలికలు ఎక్కువగా ఉండడంతో పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. జూలై 28న ప్రారంభమైన వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. గతంలో ప్రజా పోరాటాల్లో పలువురు అగ్రనేతలు నేలకొరగడంతో అప్పటి నుంచి ప్రతీ ఏడాది అమరవీరులను స్మరించుకుంటూ వారోత్సవాలను జరుపుకోవడం మావోయిస్టులకు ఆనవాయితీగా వస్తోంది. వారోత్సవాలలో ప్రజలు భాగస్వాములుకావాలని మావోయిస్టు నేతలు సోషల్ మీడియా, కరపత్రాలు, పత్రిక ప్రకటనల ద్వారా పిలుపునిచ్చారు. దీంతో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సర్కిల్ పోలీస్ ఉన్నతాధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కె.తాజొద్దీన్ నేతృత్వంలో అడవులను జల్లెడ పట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. మండల పరిధిలోని వివిధ గొత్తికోయ గూడెల్లో సోదాలు చేశారు. గోదావరి తీరం వద్ద నిఘా పెంచారు. అధికార పార్టీ నేతలను, టార్గెట్లను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏజెన్సీలో ముమ్మర తనిఖీలు చేపట్టడంతో పాటు స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు సైతం అడవులను జల్లెడ పట్టారు. ఎట్టకేలకు ఏజెన్సీలో వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)



గాంధీనగర్ గుట్టపై మొక్క నాటుతున్న మంత్రులు

మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను కూడా పెంచుతామని, ఐటీ అధిపతులతో మాట్లాడి ఐటీ కంపెనీలు కూడా తీసుకువస్తామన్నారు. ధరణిని ప్రక్షాళన చేసి ప్రజలను అధికారులు, నాయకుల చుట్టూ తిరగకుండా చేస్తామన్నారు.

గత పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు : మంత్రి సీతక్క



బీఆర్ఎస్ ఉద్యోగాలనినాదంతో తెలంగాణ ఉద్యమం చేశామని చెప్పి.. రాష్ట్రం, ప్రభుత్వం వచ్చాక పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని మంత్రి సీతక్క విమర్శించారు. ఉపాధి అవకాశాల వేటలో చాలా మంది పట్టణాల బాట పడుతున్నారని, ఇలా గ్రామీణ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌లు ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ములుగులో కూడా నేషనల్ హైవేకు దగ్గరలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రుణమాఫీ జరిగిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. అధికారం పోయిందనే అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, అనేక హామీలు ఇచ్చి ప్రజలను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. స్కిల్ ఇండియా పేరుతో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించామన్నారు. ఇటీవల జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే తట్టుకోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంటుందని ఆకాంక్షించారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ జిల్లాలో ఖనిజ సంపద అపారంగా ఉందని ఇక్కడికి రావాల్సిన నిధులను కేటాయించి ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ఇండస్ట్రియల్ కారిడార్ విషయంలో పార్లమెంట్‌లో మాట్లాడతానన్నారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనకు రావడం సంతోషంగా ఉందని, ఇక్కడ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతా : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానన్నారు. 60 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో ఉపాధి దొరుకుతుందన్నారు. ఇక డీబీఎం-38 కాల్వ మరమ్మతులు చేపడితే నియోజకవర్గంలో సుమారు 44వేల ఎకరాల పంటలకు నీరందుతుందని, దాని మరమ్మతులకు నిధులందించాలని మంత్రులకు విజ్ఞప్తిచేశారు. అంతేకాకుండా గత సంవత్సరం కురిసిన వర్షాలకు చెరువులు, రోడ్లు తెగిపోగా అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెరువులు మరమ్మతులతోపాటు రోడ్లు వేశామన్నారు. అంతేకాకుండా నియోజకవర్గానికి వచ్చే ఇందిరమ్మ ఇళ్లతోపాటు అదనంగా మరో2వేల ఇళ్లనుకేటాయించాలని మంత్రులను కోరారు.

డెంగీ లక్షణాలతో నిండు గర్భిణి మృతి

▸▸ ములుగు మండలం జాకారంలో విషాదం



అక్షిత (ఫైల్)

ములుగు, ఆగస్టు 3: ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన నిండు గర్భిణి మంచోజు అక్షిత(25) డెంగీ లక్షణాలతో శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. 8 నెలల గర్భవతి అయిన అక్షితకు వారం క్రితం జ్వరం సోకింది. నర్సంపేటలో ప్రతీ నెల వైద్య పరీక్షలు చేయించుకునే డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడుతున్నారు. మంగళవారం ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో బుధవారం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు గర్భస్థ శిశువు మరణించినట్లు గుర్తించి శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఆతర్వాత అక్షిత ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈనేపథ్యంలో చికిత్స పొందుతూ ఆమె కన్నుమూసింది. మృతురాలికి భర్త రాజేంద్రప్రసాద్, మూడేళ్ల కుమార్తె అనీహ ఉన్నారు. గర్భిణి మృతితో జాకారం గ్రామంలో విషాదం అలుముకుంది.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్యాల, ఆగస్టు 3: భర్త తరపు బంధువుల వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చల్లగరిగకు చెందిన కావటి నర్సింహస్వామికి రేగొండ మండలం రేపాకపల్లి గ్రామానికి చెందిన గండు లావణ్య(22)తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు పుట్టడం లేదని లావణ్యను అత్త, ఇద్దరు ఆడబిడ్డలు, బావ, అల్లుడు గత కొద్ది రోజులుగా తరచుగా వేధిస్తున్నట్లు తెలిపారు. అవమానంగా భావించిన లావణ్య గత నెల 29న ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి గండు మల్లయ్య ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

▸▸ కాపాడిన వాజేడు ఎస్సై హరీష్

వాజేడు, ఆగస్టు 3: బీటెక్ పూర్తి చేసిన ఓ యువకుడు ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వాజేడు మండలంలోని బొగ్గుల వాగు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై హరీష్ తెలిపిన ప్రకారం... వరంగల్ జిల్లా కేంద్రం మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నపేటకు చెందిన వేముల సాయికృష్ణ అనే యువకుడు ఐదేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేశాడు. ఇటీవల ఏఈఈ ఉద్యోగ పరీక్ష రాయగా ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. ఆ ఫలితాల్లో తన పేరు రాలేదని సాయికృష్ణ తెలుసుకున్నాడు. ఈ క్రమంలోనే తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో మనస్తాపం చెంది బైక్‌పై ములుగు జిల్లా వాజేడు మండలంలోని మురుమూరు-బిజినేపల్లి మధ్యలో ఉన్న బొగ్గుల వాగు వద్దకు శుక్రవారం రాత్రి చేరుకున్నాడు. వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి రాత్రి 10.30 గంటల సమయంలో తన మిత్రుడికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. హైరాన పడ్డ మిత్రుడు తనకు తెలిసిన వారితో వాజేడు ఎస్సైకు సమాచారం ఇవ్వగా లోకేషన్ ఆధారంగా సాయికృష్ణ ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన ఎస్సై హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాయికృష్ణను 108 వాహనంలో ఏటూరునాగారం తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, సాయికృష్ణ తండ్రి శ్రీనివాస్ హనుమకొండలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిట్యాల, ఆగస్టు 3: పొలానికి నీరు పెట్టేందుకు బావి వద్ద మోటారు స్టార్టర్ ఆన్‌చేసే క్రమంలో రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడ. ఈ ఘటన మండలంలోని ముచినిపర్తి శివారు గుంటూరుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపినప్రకారం... గ్రామానికి చెందిన రైతు మోర్తాల లక్ష్మారెడ్డి(35)కి 4ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 3 ఎకరాల్లో పత్తి, ఎకరంలో వరిపంట సాగు చేస్తున్నాడు. ఇంటి పక్కనే ఉన్న వరిపంటకు నీరు పెట్టేందుకు మధ్యాహ్నం మోటర్ స్టార్టర్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తండ్రి మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య వాణిశ్రీ, మూడు నెలల కూతురు ఉంది. కలివిడిగా ఉంటే లక్ష్మారెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొలంలో గొర్రు కొట్టడానికి వెళ్తూ..

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి



రూపిరెడ్డిపల్లిలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రేగొండ, ఆగస్టు 3 : పొలంలో గొర్రు కొట్టడానికి ఓ రైతు ఇనుప గొర్రును ఎత్తుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంచగిరి రమేష్(36) అనే రైతు శనివారం మధ్యాహ్నం సమ్మయ్యకుంట చెరువు పక్కన ఉన్న పొలంలో గొర్రు కొట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో భుజాన ఇనుప గొర్రును ఎత్తుకుని వెళ్తుండగా కిందకు వేళాడుతున్న విద్యుత్ వైర్లకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే దారిలో వెళ్తున్న గ్రామస్తుడు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. రైతు మృతి చెందడానికి కారకులైన విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలని పరకాల-భూపాలపల్లి రహదారిపై గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఎన్నిసార్లు లూజ్ వైర్లను సరిచేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఎస్సై రవికుమార్ ధర్నా చేస్తున్న వారితో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. అనంతరం రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హరియాణా పోలీసుల అదుపులో మల్హర్ మండల యువకుడు

▸▸ గంజాయి స్మగ్లింగ్‌కు సహకరించాడనే ఆరోపణ

కాటారం, ఆగస్టు 3 : మండలంలోని మద్దులపల్లి వద్ద ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్న కాటారం డివిజన్‌లోని మల్హర్ మండలానికి చెందిన యువకుడిని హరియాణా రాష్ట్ర పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. హరియాణా రాష్ట్రంలోని రోహతక్ జిల్లాలో ఓ వ్యక్తి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడినట్లు తెలుస్తోంది. దీంతో గంజాయితో దొరికిన వ్యక్తిని విచారించగా మండలంలో మెకానిక్‌గా పనిచేస్తున్న యువకుడు గంజాయి రవాణా లింక్ తెలిపాడని పోలీసులకు చెప్పడంతో సదరు గంజాయి స్మగ్లర్‌ను వెంటపెట్టుకుని వచ్చారు. గతంలో మెకానిక్ గంజాయి సేవించిన కేసులో జైలుకు వెళ్లిన సమయంలో హరియాణాలో పట్టుబడ్డ గంజాయి స్మగ్లర్‌కు పరిచయమైనట్లు సమాచారం. కాగా, స్థానిక పోలీసులకు సమాచారమిచ్చి హరియాణా పోలీసులు సదరు మెకానిక్ యువకుడిని అదుపులోకి తీసుకుని పట్టుకెళ్లారని విశ్వసనీయ సమాచారం.